టైరు చూసుకో.. ప్రాణం నిలుపుకో

➡ఏడాది క్రితం టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, కర్నూలు మాజీ ఎంపీపీ రాజవర్ధన్‌రెడ్డి రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. హైదరాబాద్ నుంచి కర్నూలుకు వస్తుండటంతో జోగులాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండలం ఇటిక్యాలపాడు గ్రామ శివారులో జాతీయ రహదారిపై ఒక్కసారిగా కారు రెండు వైపులా టైర్లు పేలడంతో వాహనం సమీపంలోని పొలాల్లోకి దూసుకెళ్లడంతో రాజవర్ధన్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు.

➡ఆలూరు మాజీ ఎమ్మెల్యే నీరజారెడ్డి రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు. ఈనెల 16వ తేదీ హైదరాబాద్ నుంచి కర్నూలుకు కారులో వస్తుండగా జోగులాంబ గద్వాల జిల్లా బీచుపల్లి వద్ద టైరు పగిలిపోవడంతో కారు అదుపు తప్పి బోల్తా పడింది. తీవ్రంగా గాయపడిన ఆమె కర్నూలులో చికిత్స పొందుతూ మృతి చెందారు.

ఈ రెండు ఘటనలే కాదు వేసవి వచ్చిందంటే చాలు వాహనాల టైర్లు పేలడం, మంటలు చెలరేగి వాహనాలు దగ్ధమవడం ఇంటి ఘటనలు తరచూ జరుగుతున్నాయి. వేసవి సెలవులను ఎంజాయ్ చేయడానికో.. శుభకార్యాలకో కుటుంబ సభ్యులతో దూర ప్రాంతాలకు ప్రయాణం చేసే వారు వాహనాల కండీషన్, చక్రాల నాణ్యతపై కాస్త జాగ్రత పాటించాలి. లేకపోతే సంతోషాల సంగమంతో ప్రారంభమైన ప్రయాణాలు విషాదంగా ముగిసే ప్రమాదముంది.

– కర్నూలు కల్చరల్

వాహనదారులు క్రమం తప్పకుండా తమ వాహనాలను మెకానిక్ వద్దకు తీసుకెళ్లి చెక్ చేయించుకోవాలి. వాహనం నిర్వహణతో పాటు టైర్లను ఎప్పటికప్పుడు పరిశీలించుకోవాలి. ఎండా కాలంలో అయితే దూరప్రయాణాల సమయంలో మరింత జాగరూకతతో ఉండాలి. ఇటీవల టైర్లు పేలి వాహనాల ప్రమాదాల్లో ప్రముఖులు మృతిచెందిన విషయం విదితమే. ఈనేపథ్యంలో టైర్ల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై 'సాక్షి' పాఠకుల కోసం..

- వాహనాల టైర్లపై దృష్టి సారించాలి
- నిర్వహణ సరిగా లేకుంటే ప్రమాదాలకు అవకాశం
- నాణ్యమైన టైర్లనే వినియోగించాలి
- వేసవిలో మరింత అప్రమత్తత అవసరం

➡క్వాలిటీ టైర్లనే వాడాలి. కాలపరిమితి ముగిసిన టైర్లను ఎట్టి పరిస్థితుల్లో వాడరాదు. ప్రెషర్ సమపాళ్లలో ఉండేలా చూసుకోవాలి. టైర్ బటన్ సమాంతరంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి.

➡కంపెనీలను బట్టి 30 వేల నుంచి 60 వేల కి.మీ. వరకు టైర్లు పనిచేస్తాయి. ఆ తర్వాత కచ్చితంగా మార్చుకోవాలి.

➡వాహనాలను నెలల తరబడి వాడకుండా ఉంచరాదు. అలా ఉంచితే చక్రాలు గట్టి పడి ఉంటాయి. అలాంటి వాటిని బయటకు తీసుకెళ్తే ఒత్తిడి పెరిగి పగిలే ప్రమాదం ఉంది.

➡బ్రేకులు, బ్రేక్ షూ సరిగ్గా పని చేయకపోయినా టైర్లతో పాటు వాటి చుట్టూ ఏర్పాటు చేసిన డిస్కులు వేడికి పగిలే ప్రమాదముంది. వాటిని కూడా తరచూ సరిచూసుకోవాలి.

➡దూర ప్రయాణమైతే మధ్యలో అప్పుడప్పుడు వాహనం నిలిపి చక్రాలపై చేయి వేసి చూడాలి. గోరు వెచ్చని సెగ వస్తే బ్రేక్ పట్టేస్తోందని సంకేతం. వెంటనే మెకానిక్‌కు చూపించాలి.

➡సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదు.

➡మితిమీరిన వేగంతో వాహనాలు నడుపుతుంటారు. సర్వీసు రోడ్లు కలిసిన చోట, ప్రధాన కూడళ్ల వద్ద, స్పీడ్ బ్రేకర్లపై వేగంగా వెళ్లరాదు.



పగుళ్లిచ్చిన టైర్

➡ నైట్రోజన్ ఎయిర్ వాడటం ఉత్తమం. నైట్రోజన్ ఎయిర్ త్వరగా టైర్ హీట్ అవ్వదు. ఆక్సిజన్ టైర్ కంటే నైట్రోజన్ టైర్స్ లైట్ వెయిట్‌గా ఉంటాయి.

➡ నైట్రోజన్ గాలిని నింపే పంపులు అందుబాటులో ఉన్నాయి. సాధారణంగా గాలికి రూ.5 నుంచి రూ.10 తీసుకుంటారు. నైట్రోజన్ గాలికి రూ.25 నుంచి రూ.150 వరకు తీసుకుంటారు.

➡వర్షాకాలం, ఎండాకాలంలో గాలి తగ్గుతుంది. గమనించి ఎప్పటికప్పుడు సరిపడా గాలి నింపాలి.

➡చక్రాల్లో గాలి కీలకం. 10 –15 రోజులకు ఒకసారి పరిశీలించుకోవాలి. ఆయా వాహన సామర్థ్యాన్ని బట్టి గాలి పట్టించాల్సి ఉంటుంది. ముందు టైర్లలో 30 శాతం, వెనక చక్రాలకు 35–40 శాతం గాలి ఉండాలి.

➡ వాహనం ప్రయాణించేటప్పుడు వేడెక్కి ఉంటుంది. కాస్త చల్లబడిన తర్వాత గాలి నింపాలి.

➡ వాహనం నడిపేటప్పుడు ఏమాత్రం అసౌకర్యంగా అనిపించినా వెంటనే మెకానిక్‌ను సంప్రదించాలి.

చక్రాల కాలపరిమితి నాలుగేళ్లు



ఇండియన్ టైర్ టెక్నికల్ అడ్వైజర్ కమిటీ ఆటోమోటివ్ టైర్ మాన్యుఫ్యాక్చరింగ్ అసోసియేషన్ ప్రకారం టైర్ల కాలపరిమితి 4 ఏళ్లు. ఆ తర్వాత కచ్చితంగా మార్చుకోవాలి. వీటిని కూడా ప్రతి నాలుగు నెలలకు ఒకసారి లేదా 5,000 కిలోమీటర్లకు ఒకసారి టైర్ రొటేషన్, అలైన్‌మెంట్ బ్యాలెన్సింగ్ చేయాలి. టైర్ సర్వీస్ సెంటర్ ఆథరైజ్డ్ వారి వద్దకు తరచూ వెళ్లడంతో కస్టమర్లకు సరైన సూచనలతో పాటు సమాచారం ఇస్తారు. టైర్ బటన్ సాధారణంగా 8 ఎంఎమ్ –12 ఎంఎమ్ వరకు ఉంటుంది. ఎప్పుడైతే బటన్ 1 ఎంఎమ్ – 2 ఎంఎమ్‌కు వస్తుందో అప్పుడు కూడా టైర్లను మార్చుకోవాలి. టైర్స్‌లో వాడే మిశ్రమం సిలికా ఎంత ఎక్కువ ఉంటే టైర్స్ అంత లైఫ్ వస్తుంది. సిలికా శాతం ఎక్కువ ఉన్న టైర్లకు ప్రాధాన్యత ఇవ్వాలి.

– దేశాయ్ చిన్నారెడ్డి,
ఆటో సర్వీస్ టెక్నికల్ ఇంజినీర్

క్లుప్తంగా

2కే ర్యాలీలో రవీంద్ర విద్యార్థులు



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, సిబ్బంది

కర్నూలు సిటీ: రవీంద్ర మహిళ ఇంజినీరింగ్ కాలేజీ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో టెక్నో కల్చరల్ ఈవెంట్ సందర్భంగా ఆజాదికా అమృత్ మహోత్సవ్ సంబరాల్లో భాగంగా ఆదివారం కలెక్టరేట్ నుంచి రాజ్‌విహార్ వరకు 2కే ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని కాలేజీ వ్యవస్థాపకులు జి.పుల్లయ్య, రవీంద్ర విద్యా సంస్థల చైర్మన్ జీవీఎం మోహన్‌కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ కేఈ శ్రీనివాసమూర్తిలు ప్రారంభించారు. భారత్ మాతాకీ జై, జై జవాన్, జై కిసాన్ నినాదాలు చేస్తూ విద్యార్థులు ర్యాలీలో పాల్గొన్నారు.

మన్‌కీబాత్‌కు అసెంబ్లీ ఇన్‌చార్జ్‌ల నియామకం

కర్నూలు కల్చరల్: దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన మన్‌కీ బాత్ కార్యక్రమం ఈనెల 30న 100వ ఎపిసోడ్ ప్రసారం అవుతుందని, కార్యక్రమం విజయవంతం చేసేందుకు అసెంబ్లీల వారీగా ఇన్‌చార్జులను నియమించడం జరిగిందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, జిల్లా మన్‌కీ బాత్ ఇన్‌చార్జ్ కాళింగి నరసింహ వర్మ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ కర్నూలు అసెంబ్లీకి చిలకల రాఘవేంద్ర, కోడుమూరు అసెంబ్లీకి బి.వీరన్న, ఎమ్మిగనూరు అసెంబ్లీకి సురేంద్ర, మంత్రాలయం అసెంబ్లీకి కురువ రాముడు, ఆదోనికి మల్లెకర్ శ్రీనివాసులు, పత్తికొండకు పూన మల్లికార్జున, ఆలూరుకు చిదానందలను ఇన్‌చార్జులుగా నియమించినట్లు తెలిపారు.

ఘనంగా బసవేశ్వరస్వామి జయంతి



పూజలందుకున్న బసవేశ్వరస్వామి

కర్నూలు(హాస్పిటల్): విశ్వగురు బసవేశ్వరస్వా మి జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. నగరంలోని చిత్తారివీధి జమ్మిచెట్టు ఎదురుగా ఉన్న బసవేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి విగ్రహానికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వీరశైవ భక్తాదులతో పాటు ప్రజలు హాజరై స్వామివారి ఆశీస్సులు అందుకున్నట్లు ఆలయ నిర్వాహకులు బాల భాస్కర్, ఉమా మహేష్ తెలిపారు.

రౌడీ గ్యాంగ్‌ను కట్టడి చేయాలి

కర్నూలు(సెంట్రల్): మండలంలోని పసుపల గ్రామ పరిధిలో ప్రజలపై దాడులకు పాల్పడుతున్న రౌడీ గ్యాంగ్‌ను పోలీసులు కట్టడి చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.ప్రభాకరరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. గుర్తు తెలియని ఈ గ్యాంగ్ శనవారం మూడు చోట్లా ప్రజలపై దాడి చేసిన దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయన్నారు. వాటి ఆధారంగా గుర్తించి కేసు నమోదు చేయాలని తాలూకా పోలీసులకు విజ్ఞప్తి చేశారు.

8న 'చిన్మయ ప్రభావళి' ప్రారంభం

కర్నూలు కల్చరల్: స్థానిక వెంకటరమణ కాలనీలో చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మితమైన 'చిన్మయ ప్రభావళి' భవనం వచ్చే నెల 8న ప్రారంభించనున్నట్లు చిన్మయ మిషన్ జిల్లా బాధ్యులు స్వామిని సుప్రేమానంద ఆదివారం తెలిపారు.

నేడు రాయలసీమ కర్తవ్య దీక్ష

కర్నూలు కల్చరల్: సిద్దేశ్వరం–సోమశిల ప్రాజెక్ట్ వద్ద బ్రిడ్జి కం బ్యారేజ్‌ను నిర్మించాలని, రాయలసీమ ప్రాంత సమస్యలు పరిష్కరించాలని, పెండింగ్ ప్రాజెక్ట్‌ల నిర్మాణాలను పూర్తి చేయాలనే ప్రధాన డిమాండ్లతో రాయలసీమ మేధావుల స్టీరింగ్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఎస్టీబీసీ కళాశాల మైదానంలో రాయలసీమ కర్తవ్య దీక్ష చేపడుతున్నట్లు రాయలసీమ కర్తవ్య దీక్ష కమిటీ చైర్మన్ బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ దీక్షకు మాజీ ఎంపీ గంగుల ప్రతాప్‌రెడ్డి, మాజీ మంత్రులు మైసూరా రెడ్డి, ఆదినారాయణరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు తులసి రెడ్డి, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ, ప్రజా గాయకుడు గద్దర్ తదితర మేధావులు, రాజకీయ పార్టీల నాయకులు హాజరై మద్దతు ప్రకటించనున్నారన్నారు.

సాక్షి సినిమాలు

ఎస్‌వీసీ కాంప్లెక్స్ : కిసీ కా భాయ్ కిసీ కా జాన్, విరుపాక్షి, దసరా, ఇవిల్ డెడ్ రైజ్, శాకుంతలం, రావణాసుర
వి మెగా ఆనంద్ సినీ కాంప్లెక్ : కిసీ కా భాయ్ కిసీ కా జాన్, విరుపాక్షి, దసరా, ఇవిల్ డెడ్ రైజ్, విడుదల పార్ట్–1, రుద్రుడు, శాకుంతలం
వెంకటేష్ సినీ కాంప్లెక్స్ : విరుపాక్షి, విడుదల పార్ట్–1, రుద్రుడు
ఐనాక్స్ : కిసీ కా భాయ్ కిసీ కా జాన్, ఇవిల్ డెడ్ రైజ్, సుజుమె, విడుదల పార్ట్–1, ది సూపర్ మారియో బ్రదర్స్, హలో మీరా, రావణాసుర
భరత్ కాంప్లెక్స్ : కిసీ కా భాయ్ కిసీ కా జాన్, బలగం, దసరా
శ్రీరామ : విరుపాక్షి, **రాజ్ :** విరుపాక్షి
విజయ : కిసీ కా భాయ్ కిసీ కా జాన్

భక్తిశ్రద్ధలతో అక్షయ తృతీయ పూజలు



మజ్జిగ పంపిణీ చేస్తున్న దృశ్యం



ద్రాక్ష ఫలాలతో విశేష అలంకారంలో సూర్యనారాయణుడు

కర్నూలు కల్చరల్: అక్షయ తృతీయను పురస్కరించుకుని నగర శివారులోని సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సూర్యనారాయణ స్వామి మూల విరాట్‌కు ద్రాక్ష ఫలాలతో విశేష అలంకరణ చేసి దర్శనం కల్పించారు. నవగ్రహ, గణపతి, సంపుటిత శ్రీ సూక్త హోమ సహిత స్వర్ణాకర్షణ భైరవ లక్ష్మీ కుబేర హోమం, రాజ శ్యామల మూల మంత్ర హోమాలు జరిగాయి. అనంతరం ఆలయం సమీపంలోని జాతీయ రహదారి ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద మజ్జిగ, పులిహోర ప్యాకెట్లను పంపిణీ చేశారు. 29వ వార్డు కార్పొరేటర్ సుదర్శన్‌రెడ్డి పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. వేసవి కాలం ఎండలు తీవ్రంగా ఉండటంతో శ్రీ అనగా దత్త జ్ఞాన బోధ సభా ట్రస్ట్ ఆధ్వర్యంలో దాహార్తిని తీర్చేందుకు ఉచితంగా మజ్జిగ పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు శివరామకృష్ణ, డాక్టర్ ఆంజనేయులు, డాక్టర్ నగేష్ వర్మ, ప్రకాష్, రమేష్ వర్మ, జ్యోతి, శైలజ పాల్గొన్నారు.

'మైపర్'లో ఘనంగా వీడ్కోలు



విద్యార్థులతో కాలేజీ డైరెక్టర్ డాక్టర్ ఆదిమూలపు సతీష్

కర్నూలు సిటీ: ఏక్యాంపులోని మదర్ థెరిస్సా ఫార్మ సీ కాలేజీ(మైపర్)లో కోర్సు పూర్తి చేసుకున్న సీనియర్ విద్యార్థులకు జూనియర్స్ ఆదివారం వీడ్కో లు పలికారు. కార్యక్రమానికి కాలేజీ డైరెక్టర్ డాక్టర్ ఆదిమూలపు సతీష్, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ స్టెల్లా సతీష్ హాజరై ప్రసంగించారు. ఫార్మసీ విద్య వల్ల ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉంటా యన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వేడుకల్లో కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ రవి కుమార్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సురేష్, అకడమిక్ డీన్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రాణం తీసిన విద్యుదాఘాతం

గూడూరు: విద్యుత్ షాక్‌తో పట్టణానికి చెందిన గొల్ల ధనుంజయ (36) ఆదివారం మృతి చెందాడు. పత్తి విత్తనాలు నాటడానికి పొలం వెళ్లాడు. నీరు పెట్టుకోవడానికి విద్యుత్ స్టార్టర్ ఆన్ చేయగా ప్రమాదవశాత్తు షాక్ కొట్టింది. గమనించిన చుట్టుపక్కల వారు ఆసుపత్రికి తీసుకెళ్లగా గొల్ల ధనుంజయ అప్పటికే మృతి చెందాడు. మృతిని తండ్రి వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. మృతుడుకి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

గుండెపోటుతో యువకుడి మృతి

డోన్ టౌన్: పట్టణంలోని అంబేడ్కర్ నగర్‌కు చెందిన కార్తీక్ (25)అనే యువకుడు గుండెపోటుతో మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. ఆదివారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వచ్చి గేట్ల సమీపంలో ఆకస్మాత్తుగా పడిపోగా ఆసుపత్రికి తరలించగా గుండె పోటుతో మృతి చెందినట్లు వైద్యులు తెలిపారన్నారు. మృతునికి భార్యతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు.

రేపటిలోపు విద్యార్థులను చేర్చుకోవాలి

కర్నూలు సిటీ: విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేటు విద్యా సంస్థలు 25 శాతం సీట్లు పేద విద్యార్థులకు కేటాయించాలి. జిల్లాలో ఇందుకు 827 మంది విద్యార్థులు అర్హత పొందారు. ఈ వివరాలు ఆయా గ్రామ, వార్డు సచివాలయాల్లోను, పంచాయతీ కార్యాలయంలో నోటీసు బోర్డుల్లో ప్రదర్శించారు. రేపటి(మంగళవారం) లోపు విద్యార్థులను చేర్చుకోని స్కూళ్లపై కఠిన చర్యలు తీసుకుంటామని విద్యాశాఖ అధికారులు హెచ్చరించారు.

ఘనంగా బసవేశ్వర జయంతి

కల్లూరు: స్థానిక ఈశ్వర వీరభద్రస్వామి దేవాలయంలో కల్యాణ బసవేశ్వరుడి 892వ జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి పాల్గొన్నారు. ఆలయ కమిటీ నిర్వహణలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని స్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్పొరేటర్ నరసింహులు, నాయకులు రంగప్ప, చిన్న తదితరులు పాల్గొన్నారు.



బసవేశ్వర జయంతి వేడుకల్లో కమిటీ ప్రతినిధులు, భక్తులతో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న యోగా గురువు దత్తయ్య, ఇతర సభ్యులు



యోగాసంలో యోగా కేంద్రం సభ్యులు



యోగాసనాలు ప్రదర్శిస్తున్న యోగ కేంద్రం సభ్యులు

కర్నూలు కల్చరల్: యోగతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని యోగా గురువు, శ్రీ పతంజలి సాయినాథ్ యోగ శిక్షణ కేంద్ర వ్యవస్థాపకులు పెరుమాళ్ల దత్తయ్య అన్నారు. ఆదివారం వీఆర్ కాలనీలోని లక్ష్మీవెంకటేశ్వర స్వామి కల్యాణ మండపంలో పతంజలి సాయినాథ్ యోగ శిక్షణ కేంద్రం వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం యోగ చేయడం వల్ల మానసిక ప్రశాంతతతో పాటు ఉత్సాహంగా ఉంటామన్నారు. చిన్న చిన్న ఆరోగ్య సమస్యలు ఉన్నా యోగాసనాలతో ఉపమశమనం పొందవచ్చన్నారు. అనంతరం కేంద్ర సభ్యులు ప్రదర్శించిన నృత్యాలు, యోగాసనాలు ఆకట్టుకున్నాయి. కేంద్ర కార్యదర్శి రేగూరు బాలకృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సభ్యులు రంగస్వామి, మేఘశ్యామ్, సుచరిత తదితరులు పాల్గొన్నారు.

బ్లాక్ బెల్ట్ క్రీడాకారులకు అభినందనలు



క్రీడాకారులను అభినందిస్తున్న టీజీ వెంకటేష్

కర్నూలు (టౌన్): ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన కుక్వాన్ కొరియా బ్లాక్ బెల్ట్ పోటీల్లో నారాయణ ఇంగ్లిషు మీడియం స్కూల్ విద్యార్థి మధుసూదన్, వర్మ ఇంగ్లిషు మీడియం స్కూల్ విద్యార్థులు తిలక్ అఖిల్, సాయిక్రిష్ణ ప్రతిభ చాటి బ్లాక్ బెల్టులు సాధించారు. విద్యార్థులను ఆదివారం స్థానిక సంకల్‌బాగ్‌లోని మాజీ ఎంపీ టీజీ వెంకటేష్ తన నివాసంలో అభినందించారు. ఈ సందర్భంగా టీజీ మాట్లాడుతూ చిన్నప్పటి నుంచే తల్లిదండ్రులు తమ పిల్లలను మార్షల్ ఆర్ట్స్ వంటి తైక్వాండో పోటీలకు ప్రోత్సహించడం హర్షించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో శిక్షకుడు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బిల్లుల వసూలుపై దృష్టి పెట్టండి

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ బిల్లుల వసూలుపై దృష్టి పెట్టాలని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు రూరల్స్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు వై. సుబ్బన్న సూచించారు. ఆదివారం ఆయన కింది స్థాయి సిబ్బందితో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. నెలవారీ బిల్లింగ్ ప్రక్రియ ముగిసి 13 రోజులు గడిచిందని, బిల్లుల వసూలుపై దృష్టి పెట్టాలన్నారు. వంద శాతం బిల్లుల వసూలే లక్ష్యంగా ఏఈలు, లైన్ ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మెన్లు ప్రణాళికలు చేసుకోవాలని సూచించారు.

ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డిపై ఆరోపణలు తగదు



మాట్లాడుతున్న సత్యంయాదవ్

కర్నూలు(సెంట్రల్): ఆదోని ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్‌రెడ్డిపై ఆరోపణలు చేయడం టీడీపీ నాయకుడు లోకేష్‌కు తగదని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి సత్యం యాదవ్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సీహెచ్ మద్దయ్య, పార్టీ బీసీ విభాగం కార్యదర్శి ధనుంజయాచారి హితవుపలికారు. ఆదివారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. వార్డు మెంబర్‌గా గెలవలని లోకేష్.. ప్రజా నాయకుడైన ఆదోని ఎమ్మెల్యేను విమర్శించడం హాస్యాస్పదమన్నారు. ఆదోనిలో సాయిప్రసాద్‌రెడ్డి చేసిన సేవలు కనిపించడంలేదా అని ప్రశ్నించారు. ఆదోని అర్బన్ డెవలమెంట్ అథారిటీ ద్వారా పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో తాగు, సాగునీటి ఇబ్బందులను తీర్చేందుకు చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఆదోనికి మెడికల్ కాలేజీని తెచ్చేందుకు ఎమ్మెల్యే ఎంతో కృషి చేశారన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఆదోనికి చేసిన ఒక్క మేలును చెప్పాలన్నారు.

మసీదు నిర్మాణానికి సహకరించండి



కోడుమూరు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

కర్నూలు(అగ్రికల్చర్): మండల పరిధిలోని గార్గేయపురం చెరువు వద్ద అసంపూర్తిగా ఉన్న మసీదు నిర్మాణం పూర్తయ్యేందుకు సహకరించాలని ఏపీ ఆల్‌మేవ జిల్లా అధ్యక్షుడు, మసీదు దర్గా కమిటీ సభ్యులు సర్దార్ అబ్దుల్‌హమీద్ కోడుమూరు ఎమ్మెల్యే జరదొడ్డి సుధాకర్‌ను కోరారు. ఆదివారం ఎమ్మెల్యేను కర్నూలులోని ఆయన నివాసంలో కలసి వినతిపత్రం సమర్పించారు. 2019లో మసీదు నిర్మాణానికి ప్రభుత్వం మంజూరు చేసిన రూ.49 లక్షల్లో రూ.8 లక్షలు విడుదల కావడంతో పనులు 40 శాతం మాత్రమే జరిగాయని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పెండింగ్ నిధులు విడుదల చేయించి నిర్మాణం పూర్తయ్యేందుకు సహకరించాలని కోరగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని అబ్దుల్ హమీద్ తెలిపారు.

చందన యాత్ర ఉత్సవాలు ప్రారంభం





పూజలందుకున్న జగన్నాథ్, బలదేవ్, సుభద్ర దేవతా మూర్తులు, సందేశమిస్తున్న రామకృష్ణ ప్రభు

కర్నూలు కల్చరల్: ఇస్కాన్ ఆధ్వర్యంలో భగీరథ కాంప్లెక్స్‌లోని జగన్నాథ మందిరంలో ఆదివారం చందన యాత్ర మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. జగన్నాథ్, బలదేవ్, సుభద్ర దేవతా మూర్తులకు చందన సేవ, అలంకార సేవ, అభిషేక సేవ, సంపూర్ణ నిత్య నైవేద్యం సేవలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఇస్కాన్ బాధ్యులు రామకృష్ణ ప్రభు సందేశమిచ్చారు. పరమ పవిత్రమైన వైశాఖ మాసంలో సమస్త మానవాళికి శుభం కలుగజేయడం కోసం జగన్నాథ స్వామి వారికి వైశాఖ సుద్ధ అక్షయ తృతీయ నుంచి చందన యాత్ర ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. మే 15వ తేదీ వరకు 21 రోజులు ఉత్సవాలు జరుగుతాయన్నారు. ఆధ్యాత్మికతతో ఉత్తమ జీవనం అలవడుతుందన్నారు. భారత, భాగవతాలు జీవన యానంలో జరిగే సద్గతులకు మార్గం చూపుతాయన్నారు.

షవ్వాల్ ఉపవాసాలు ప్రారంభం



షవ్వాల్ ఉపవాస దీక్షల విరమణ ఇఫ్తార్ చేస్తున్న ముస్లిం మత పెద్దలు

కర్నూలు(రాజ్‌విహార్): షవ్వాల్ మాస నఫిల్ ఉపవాసాలు ప్రారంభమయ్యాయి. ఇస్లామిక్ క్యాలెండర్ ప్రకారం పవిత్ర రంజాన్ మాసం ముగింపు సూచికగా చంద్ర దర్శనమైన మరుసటి రోజు ఈద్ ఉల్ ఫితర్ నమాజ్ చేసుకొని పండుగ జరుపుకుంటారు. నెలవంక నుంచే షవ్వాల్ మాసం ప్రారంభమవుతుంది. ఈద్ జరుపుకున్న మరుసటి రోజు నుంచి ఆరు రోజుల పాటు షవ్వాల్ ఉపవాసాలు ప్రారంభమవుతాయి. రంజాన్ మాస రోజాలు ఫరజ్ (తప్పనిసరి) అయితే షవ్వాల్ ఉపవాసాలు నఫిల్ (భక్తి కొలది)గా పాటిస్తారు. సాధారణంగా రంజాన్ మాసంలో వివిధ కారాణాలతో ఉండలేకపోయిన రోజాల స్థానంలో వీటిని ఉంటారని మత పెద్దలు అంటారు. మత పెద్దలు, నెలంతా పాటించిన వారు సైతం భక్తికొద్దీ ఉంటారు. ముఖ్యంగా మహిళలు ప్రత్యేక కారణాలతో ఉండలేకపోయిన ఉపవాసాల స్థానంలో ఈ నఫిల్ రోజాలు ఉండి భర్తీ చేసుకుంటారు. ఇవి పాటించిన వారు 29వ తేదీన శనివారం తీపి వంటలు చేసుకొని తింటారు.

అదృశ్యమైన వ్యక్తి ఆచూకీ లభ్యం



సోమయ్యను గుర్తించిన మంత్రాలయం పోలీసులు

మంత్రాలయం రూరల్: శ్రీ రాఘవేంద్రస్వామిని దర్శించుకునేందుకు మంత్రాలయం వచ్చిన గుంటూరు జిల్లా పెద్దకాకాని మండలం తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన సోమయ్య అనే వ్యక్తి గత నాలుగు రోజుల క్రితం అదృశ్యమైన విషయం తెలిసిందే. అయితే కేసు నమోదు చేసి విచారణ వేగవంతం చేసిన పోలీసులు ఆదివారం ఆదోని సమీపంలోని బైచిగేరి క్రాస్ వద్ద సోమయ్యను గుర్తించి వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. సోమయ్యను వెతకడంలో కానిస్టేబుల్ రంగస్వామి కృషిని సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ వేణుగోపాల్‌రాజు అభినందించారు.